పంటల బీమా.. రైతుకేదీ ధీమా?

- జీమాకు కూటమి ప్రభుత్వం మంగళం
- ప్రీమియం చెల్లిస్తేనే జీమా వర్తింపు
- అన్నదాతలకు అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- భారం పడకుండా ప్రీమియం చెల్లింపు


సాగులో ఉన్న టమాట పంట

అగళి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల దెబ్బతింటే అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తోంది. అన్నదాతలపై మరింత భారం వేసే నిర్ణయాలు తీసుకుంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల కోసం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళ పాడడమే ఇందుకు ఉదాహరణ. రైతులు బీమా ప్రీమియం చెల్లించలేక అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొంది.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..

పంట నష్టపోయే రైతులను ఆదుకోవాలనే ఉదేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంట బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. రైతులు సాగు చేసిన పంటలను గ్రామస్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బంది ద్వారా ఈ–క్రాప్ చేయించారు. రైతులు వేసిన పంటలన్నింటికీ బీమాను ప్రభుత్వమే చెల్లించింది. దీంతో పంట నష్టం కూడా ఏ సీజన్‌కు సబంధించి ఆ సీజన్ లోనే రైతుల ఖాతాలో పంటనష్టం పరిహారాన్ని జమ చేసింది. దీంతో రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఉండేవికావు.

రైతులే ప్రీమియం చెల్లించాలి..

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రద్దు చేసింది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. మడకశిర నియోజకవర్గంలోని 5 మండలాల్లో అగళి 87 హెక్టార్లు, గుడిబండ 207 హెక్టార్లు, అమరాపురం 172 హెక్టార్లు, రొళ్ల 66 హెక్టార్లు, మడకశిర 208 హెక్టార్లలో పంటలు సాగవుతాయి. ప్రస్తుతం రబీ సీజన్‌లో సుమారు 750 నుంచి 1,300 హెక్టార్లలో రైతులు వరి, రాగి, మొక్కజొన్న, శనగ, టామాట, మిరప, వేరుశనగ తదితర పంటలను సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వంలాగే కూటమి ప్రభుత్వం కూడా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇవ్వలేదని, అప్పులు చేసి వ్యవసాయం చెయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా 2024–25 రబీ సీజన్‌కు ప్రీమియం చెల్లింపునకు డిసెంబర్ 15వ తేదీ వరకూ.. వరి పంటకు మాత్రం ఈనెల 30వ తేదీ ప్రభుత్వం గడువు విధించింది.

ప్రీమియం ఇలా (ఎకరాకు)..

వరి రూ.630, మొక్కజొన్న రూ.540, మినుములు రూ.265, వేరుశనగ రూ.480, పప్పుశనగ రూ.420, టామాట రూ.1,600, జొన్న రూ.297 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది.

గతంలో ప్రభుత్వమే చెల్లించింది..



గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంట బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. మేము పైసా కూడా చెల్లించలేదు. మా గ్రామంలో ఉన్న ఆర్‌బీకే సిబ్బంది పొలం వద్దకు వచ్చి ఈ–క్రాప్ నమోదు చేసుకుని వేళ్లేవారు. ఆ తరువాత పంట నష్టంపరిహారం మా ఖాతాలోనే జమ అయ్యింది. అయితే కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. ఇప్పుడు బీమా కూడా రైతులే చెల్లించాలని పేర్కొనడం అన్యాయం.

– సతీష్, గ్యారగొండపల్లి, అగళి మండలం

ప్రభుత్వమే భరించాలి



గత ప్రభుత్వం అమలు చేసిన పంటల బీమాను రద్దు చేయడం సరికాదు. పంటల బీమాకు సంబంధించిన ప్రీమియంను ప్రభుత్వమే భరించాలి. రబీ సీజన్‌లో కొత్త విధానంలో ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం అప్పగించడం జరిగింది. దీనివల్ల రైతులకు భారం తప్ప ఉపయోగం లేదు. ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తే కొంత వరకైనా రైతులకు ఉపశమనం కలుగుతుంది.

– మంజునాథ్,రైతు, కరిదాసనపల్లి,అగళి మండలం

రైతులే ప్రీమియం చెల్లించాలి



రైతులు సాగు చేసిన పంటకు బీమా వర్తించాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలి. ఈ విషయాన్ని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని పంటలకు ఈనెల 15వ తేదీ వరకూ గడువు ఉంది. వరికి మాత్రం ఈనెల 30వ తేదీ వరకూ చెల్లించవచ్చు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుంది.

– కృష్ణమీనన్, ఏడీఏ మడకశిర

క్లుప్తంగా

సోలార్ విద్యుత్‌పై అవగాహన


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

మడకశిర రూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ రూట్‌టాప్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ సురేంద్రబాబు మాట్లాడుతూ.. విద్యుత్ ఉత్పత్తి చేసేలా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్స్‌ను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో బిగిస్తుందని తెలిపారు. కిలోవాట్ల (కేవీ) ఉత్పత్తి చేసే దాన్ని బట్టి రాయితీ ఉంటుందన్నారు. బ్యాంకు లోన్ సౌకర్యం కూడా ఉందన్నారు. అనంతరం పలువురు వినియోగదారులు సోలార్ ప్యానల్స్‌ను బిగించుకోవడానికి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథ్, ఈఈ భూపతి, డీఈ రాజేంద్ర బాబు, ఏఈ విశ్వనాథ్, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ టీచర్ మృతి


శంకరనారాయణ (ఫైల్)

గోరంట్ల: మండల కేంద్రానికి చెందిన గ్రీన్ భారత్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్, పర్యావరణ జాతీయ అవార్డు గ్రహీత, రిటైర్డు టీచర్ రెడ్డివారి శంకరనారాయణ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని తన స్వగృహంలో ఉదయం ఆయనకు గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పలువురు మేధావులు, ఉపాధ్యాయులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

వాల్మీకి జాతరకు తరలి రండి


జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పావగడ: దావణగెరె జిల్లా రాజనహళ్లి వాల్మీకి గురు పీఠంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8, 9 తేదీలలో నిర్వహించే చారిత్రాత్మక వాల్మీకి జాతర కు తాలూకా వ్యాప్తంగా ఉన్న వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని రాజనహళ్లి వాల్మీకి మహా సంస్థానం పీఠాధ్యక్షుడు వాల్మీకి ప్రసన్నానంద స్వామీజీ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అతిథి గృహంలో జాతర పోస్టర్లను విడుదల చేశారు. కర్ణాటక రాజ్య వాల్మీకి సామాజిక వర్గ జాగృతి కోసం జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాలూకా జాతర సమితి అధ్యక్షుడిగా కరవే లక్ష్మి నారాయణ, సహ సంచాలకులుగా బేకరి నాగరాజు ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాళేగార్ లోకేశ్, నారాయణమూర్తి, నరసింహ కృష్ణ, శ్రీనివాస్, మంజునాథ్, బ్యాడనూరు శివు,ఆటో సత్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'నమ్మ కన్నడ హబ్బ'


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

పావగడ: కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఉద్యమ స్ఫూర్తితో కృషి చేయాలి. అప్పుడే పావగడ నలు మూలలా కన్నడ భాష పరిఢవిల్లడం సాధ్యమని ప్రముఖ కన్నడ భాషా పరిశోధకుడు డా. హెచ్‌కే నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం తాలూకాలోని వైఎన్ హొసకోట పట్టణంలో నమ్మ కన్నడ హబ్బ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నడ భాష అభివృద్ధి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు.తల్లిదండ్రులు తప్పనిసరిగా కన్నడ భాషలో మాట్లాడాలన్నారు. కన్నడ భాష అభివృద్ధి అంశంపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కావ్య, ధనలక్ష్మికి కన్నడ శ్రీ ప్రశస్తి అందించారు. ఉత్తీర్ణులైన ఇతర విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో హోమా నాగరాజు, ఏఓ నాగరాజు, అశ్వర్థ కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో కాంగ్రెస్ జెండా రెపరెపలు

పావగడ: తాలూకాలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 12 మంది సభ్యులుండగా వీరిలో వెంకటరమణప్ప ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అతను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గ్రేడ్–2 తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. అయితే కాంగ్రెస్‌కు 6 మంది, బీజేపీకి ఒకరు, జేడీఎస్‌కు 5 మంది సభ్యులుండగా.. వీరిలో నలుగురు గైర్హాజరయ్యారు. ఒకరు కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో ఓటింగ్‌కు హాజరైన 8 మంది కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణప్ప సునాయసంగా గెలిచారు.

మాజీ మంత్రి 'కాఫీ విత్ పీపుల్'


నాయకులతో కలిసి కాఫీ తాగుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం ఉదయం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కాఫీ విత్ పీపుల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలతో కలిసి కాఫీ తాగుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసిందా అని అడిగి తెలుసుకున్నారు. పలువురు ఆమెతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, సీనియర్ నాయకులు రమాకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి, సర్పంచ్ అంజినాయక్, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

హిందూపురం టౌన్: విద్యార్థుల సమస్యలు చర్చించి, పరిష్కరించే దిశగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఉండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించేందుకు ముందుకొచ్చిందని, దీని వలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులు పూర్తి చేయడంతోపాటు పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



లేపాక్షి జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి , నవీన్‌నిశ్చల్ తదితరులు

హిందూపురం: ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, త్వరగా కోలుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి సూచించారు. లేపాక్షి జెడ్పీటీసీ బాణాల శ్రీనివాసరెడ్డి అస్వస్థతతో హిందూపురం ఆసపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ శివ, లేపాక్షి ఆంజినరెడ్డి, నాయకులు నక్కలపల్లి శ్రీరామరెడ్డి, రవీంద్ర రెడ్డి, నిసార్, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మంజునాథ్, కౌన్సిలర్లు, ఆసిఫ్‌వుల్లా, మహేష్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే లేపాక్షి జెడ్పీటీసీని ఆగ్రోస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ పరామర్శించారు.

పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలి

రొళ్ల: మండల వ్యాప్తంగా 65 ప్రభుత్వం పాఠశాలల్లో శనివారం జరిగే మెగా పేరెంట్స్ మీట్‌కు ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివనారాయణ రెడ్డి, ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక సచివాలయం ఆవరణలో ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంయుక్తంగా కలిసి అభివృద్ధి చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల ఆవరణలో మెగా పేరెంట్స్ మీట్‌ను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం హొట్టేబెట్ట, కల్లురొప్పం, కొత్తపాళ్యం తదితర ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

పెనుకొండ: తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. దివంగత పీఈటీ బీసీ బాబయ్య కుమారుడు ఉమాశంకర్ తన తల్లి అంజినమ్మ జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ. 8 లక్షలతో నిర్మించిన భోజనశాల, వంటగదిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమాశంకర్, ఆయన కుటుంబసభ్యులు ఆదర్శంగా నిలిచారని, అదే మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉమాశంకర్ కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించారు. కేశవయ్య, శ్రీరాంయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గణేష్, శ్రీరాములు, బీసీ. నాగరాజు, చంద్రకాంతమ్మ, రేపటి సుబ్రహ్మణ్యం, కిష్టన్న, నంజుండ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి


షెడ్డుకు తాళాలు వేసిన దృశ్యాన్ని చూపిస్తున్న సర్పంచ్

లేపాక్షి: ఆస్తి పంపకాల్లో తనకు న్యాయం చేయాలని మహిళా సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేసింది. వివరాలు.. మండలంలోని శిరివరం సర్పంచ్ నేత్రావతి భర్త శ్రీనివాసులు గత మార్చి 2న అనారోగ్యంతో మృతి చెందారు. ఆస్తి పంపకాల్లో భాగంగా గతంలో వారికి ఒక షెడ్డును ఇచ్చారు. ఈ షెడ్డులో కొంతకాలం సర్పంచ్‌తో పాటు ఆమె ఇద్దరు కుమార్తెలు నివాసమున్నారు. భర్త మృతి చెందిన అనంతరం షెడ్డును ఆమె అత్తమామలు రేషం మేపుకోవడానికి ఇతరులకు బాడుగ ఇచ్చారు. ఆ బాడుగ ఇవ్వాలని కోరగా సర్పంచ్, ఆమె పిల్లలను బయటకు పంపి తాళాలు వేశారు. తాము ఉండడానికి ఇల్లు కేటాయించి, ఆస్తిలో సగ భాగం తనకు ఇవ్వాలని అత్తమామలను డిమండ్ చేసింది. ఈ విషయంపై పోలీసుల వద్ద ఆమె తన గోడును వినిపించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు శుక్రవారం 75 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరణం రమామణి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


గుడిబండ: సదస్సులో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ రామచంద్ర

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 46 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు.

గోరంట్ల: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పుట్టపర్తి ఆర్‌డీఓ సువర్ణ పేర్కొన్నారు. శుక్రవారం గంగంపల్లిలో తహసీల్దార్ మారుతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఎంపీడీఓ నరేంద్ర, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని మైదుగోళం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు దరఖాస్తులు అందినట్టు డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రమీల, రెవెన్యూ సిబ్బంది, ఆటవీ, దేవదాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర రూరల్: భూ సమస్యలను రైతులు రెవెన్యూ అధికారుల దృషికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఛత్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ కరుణాకర్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వివిధ మండల స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరాపురం/అగళి/రొళ్ల/గుడిబండ: నియోజకవర్గంలోని అమరాపురం, అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు మారుతి ప్రకాష్, సుబ్బారావు, ఎంపీడీఓ రామరావు, పెనుకొండ డీఎల్‌పీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ శివనారాయణరెడ్డి తెలిపారు. రొళ్లలో 9 అర్జీలు, అమరాపురంలో 62 అర్జీలు, అగళి మండలంలో 5 అర్జీలు అందజేశారు.

'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది'


మడకశిరలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప


హిందూపురంలో అంబేడ్కర్ విగ్రహనికి నివాళులర్పిస్తున్న హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి టిఎన్.దీపిక, నాయకులు


హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో నివాళి అలర్పిస్తున్న చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు


పెనుకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత


పెనుకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మడకశిర/మడకశిర రూరల్/రొళ్ల/హిందూపురం /లేపాక్షి/పెనుకొండ రూరల్/లేపాక్షి: : రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ చంద్రబాబు గిట్టని వారిని వేధిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. మడకశిర పట్టణంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీపీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీలు నరసింహమూర్తి, భూతరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తనయుడు జయరాజ్, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ లాయర్ మూర్తి, మండల కన్వీనర్ రామిరెడ్డి, బీసీ విభాగం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- ప్రతిఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి టీఎన్.దీపిక అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ శివ, పార్టీనాయకులతో కలసి హిందూపురంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బలరాంరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పెనుకొండలో మంత్రి సవిత అంబేడ్కర్ విగ్రహానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల్లో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

ఎయిడ్స్‌పై అవగాహన

పెనుకొండ రూరల్: మావటూరు గ్రామంలో శుక్రవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్పీ రమేష్ యాదవ్ వ్యాధి వ్యాపించే విధానం, నివారణ చర్యలను తెలియజేశారు. సీహెచ్‌వో మహేశ్వరి, జోనల్ సూపర్ వైజర్ వెంకట్, లింక్ వర్కర్లు బాలు, రాజశేఖర్, శిల్పా ,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే జరిమానా

మడకశిర: మున్సిపాలిటీలో బహిరంగంగా మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తే రూ.260, మల విసర్జన చేస్తే రూ.500 చొప్పున జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మడకశిర మున్సిపాలిటీని స్వచ్ఛతలో మొదటి స్థానంలో నిలిపేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ, భజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మాలధారణ చేసిన అయ్యప్పలు భక్తిశ్రద్ధలతో పడి పూజ చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం ఉదయం వెండి రథంలో అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం గురుస్వామి కరియన్న మహా మంగళారతి ఇచ్చి ప్రసాద వినియోగం చేశారు.

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

హిందూపురం: పట్టణంలోని దండు రోడ్డుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామచంద్ర(45) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం పట్టణంలో నిర్మాణం జరుగుతున్నడో ప్రాంతానికి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తీసుకురావడానికి ముదిరెడ్డిపల్లికి వెళ్లిన అతను అక్కడే కుప్పకూలి పడిపోయాడు. అక్కడే ఉన్నవారు అతడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పంటల బీమాపై అవగాహన

గోరంట్ల: వానవోలు గ్రామంలో శుక్రవారం పంటల బీమాపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఏఓ మునికృష్ణ మాట్లాడుతూ మామిడి రైతులు ఎకరాకు రూ.1800, వేరుశేనగకు రూ.480 వరి రూ.630 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టపోతే బీమా కంపెనీలు పరిహారం చెల్లిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ దాస్, రైతులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టార్టర్, పైపులు ధ్వంసం

పరిగి: వంగలపల్లిలో వ్యవసాయ పొలాల్లోని రెండు విద్యుత్ స్టార్టర్లుతో పాటూ సైపన్ పైపులను దుండగులు ధ్వంసం చేశారు. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతులు రైతులు యోగానందరెడ్డి, బాలకృష్ణారెడ్డి వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ స్టార్టర్లు, పైపులను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మొత్తం 36 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ధ్వంసం చేసినట్లు బాధితులు వాపోయారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.